
మ్మని వంట చెయ్యమని అడగలేకపోయారు పెద్దపంతులుగారు, కానీ భార్యకి జ్వరం, నాల్గేళ్ళ కొడుక్కి ఆకలి కలిసి ఆయనని తొందరచేసాయి. "రావులమ్మా! వంట గదిలోకి వెళ్ళి ఏదో ఒకటి వండు, నెల రోజుల గ్రాసం వుంది. నాల్గురోజులు మనం సర్దుకుంటే ప్రభుత్వం ఆపై సాయం చేస్తుంది. ఆ వండిందే అందరం తిందాం" అన్నారు. రావులమ్మ లేని ఓపిక తెచ్చుకుంది. ఆదరాబాదరాగా కిచిడీ వండింది. ఏదో పచ్చడి వుంది ఓ జాడీలో. అంతా వరుసగా కూచున్నారు. పెద్ద పంతులు వడ్డించాడు. భార్యకీ కాస్త అన్నం పెట్టాడు. మొదటి వరసలో ఊళ్ళోంచి వచ్చిన వాళ్ళూ రెండో వరసలో హరిజనవాడ నాలుగయిదు కుటుంబాలూ కూచున్నాయి. మూడో వరుసలో ఆఖరున కూచోబోతున్న రావులమ్మ ఆగిపోయింది. ఈ వరుసలో వున్న పదహారు విస్తళ్ళలో పదిహేనుమంది విస్తరి ముందు కూచున్నారు. ముద్ద నోట్లో పెట్టుకోబోతున్నారు కూడా కానీ విస్తరిముందు కూచోబోయిన రావులమ్మ ఆగిపోయింది. అక్కడికి అప్పుడే చెలమయ్య కొడుకు గోవిందంతో వచ్చాడు. మోకాల్లోతు నీళ్ళలో వచ్చాడు. రావులమ్మ అయిదు నిముషాలు అలా చూస్తూండిపోయింది. ఆకలి రావులమ్మకీ వుంది. కానీ ఎదురుగా గోవిందం..గోచీగాడి కంటే రెండేళ్ళు పెద్ద...అంతే. ఆమెలోని మాతృహృదయం మేల్కొంది. ఆ విస్తరి గోవిందం ముందుకు జరిపింది. వెనక్కి జరిగింది. చలమయ్య కళ్ళల్లో నీళ్ళు..రావులమ్మకి అర్థం అయింది. అన్నానికీ, ఆకలికీ కులాలు లేవు. కష్టానికి కులాలు లేవు. అందుకేనేమో కష్టాలే మనుషుల్ని ఏకం చేస్తాయి. ముకుళించిన చేతుల్తో చూస్తున్న చలమయ్య చేతికి గిన్నె అడుగునున్న అన్నం పూర్తిగా తుడిచి విస్తరిలో పెట్టి అందించింది.

-యద్దనపూడి సావిత్రి (హైదరాబాద్)



# మానవత్వం

ఆదివారం మధ్యాహ్నం టీవీలో ఏదో సినిమా చూస్తున్న శ్రీనివాసు తండ్రి అరుపుకి ఒక్క ఉదుటున ఆయన ఉన్న రూములోకి వెళ్ళాడు. అతని తండ్రికి అప్పటికే సివియర్ హార్ట్ ఎటాక్ రావడంతో, మంచం మీదే అటూ ఇటూ బాధతో మెలికలు తిరిగిపోతూ కనిపించాడు. శ్రీనివాసు డాక్టరుకు ఫోను చేసే లోపే ఆయన తుది శ్వాస విడిచాడు.

తన తండ్రికి తాను ఒక్కగానొక్క కొడుకు కావడం వలన తండ్రి అంతిమ సంస్కారాల బాధ్యత అతని మీదనే ఉంది. బ్యాంకులో పెద్ద ఆఫీసరునన్న అసంభావం వలనో లేక చుట్టుపక్కల అందరూ తనకన్నా చిన్న ఉద్యోగులనే చిన్నచూపువలనో శ్రీనివాసుకు ఆ చుట్టుపక్కల వాళ్ళతో అంతగా పరిచయంగాని, చనువుగాని లేదు.

అచేతనంగా పడివున్న తన తండ్రి శరీరానికి ఎలా దహన సంస్కారాలు చేయాలో అతనికి పాలుపోవడం లేదు. తండ్రి మరణ వార్తను బంధువులకు, స్నేహితులకు తెలియజేసాడు. సూర్యాస్తమయానికి ముందే దహన సంస్కారాలు కావించమని వారు చెప్పటంతో, అవి తనొక్కడూ ఎలా చెయ్యాలో తెలియని శ్రీనివాసులో ఏదో కంగారు మొదలయ్యింది.

తండ్రి బ్రతికున్న రోజుల్లో చుట్టుపక్కల వాళ్ల విషయంలో తనకి తండ్రికి ఎప్పుడూ వాగ్వివాదం జరిగేది. ఓ సమాజంలో మనం బ్రతుకుతున్నప్పుడు తమ చుట్టూ ఉన్నవాళ్ళతో సత్సంబంధాలు కలిగి ఉండాలి అనేవాడు తండ్రి. ఏమీ అక్కర్లేదు, డబ్బుంటే చాలు. అవే జరుగుతాయి అని తాను వాదించేవాడు. ఇదిగో నేడు ఆయన అన్న మాట అక్షరాలా నిజమయ్యింది. ఇరుగు పొరుగు ఎవరితోను పెద్దగా పరిచయాలు లేని అతనికి ఈ గండం నుండి ఎలా బైటపడాలో తెలియడం లేదు. ఎవర్నైనా పిలవాలన్నా, ఏ మొహం పెట్టుకొని పిలుస్తాను. ఎవరింటికైనా, ఏ కార్యానికైనా తాను వెళ్తేగా, తను పిలవగానే వారూ వస్తారు అనుకోవడానికి. మనసులోనే తన వైఖరికి బాధపడ్డాడు.

మధ్యాహ్నం శ్రీనివాసు ఇంట్లో పనిచేయడానికి వచ్చిన సుబ్బమ్మ అతని తండ్రి మరణవార్తని, ఆ చుట్టుపక్కల వాళ్ళకి క్షణాల్లో చేరవేసింది. విషయం విన్న వాళ్ళు వెంటనే శ్రీనివాసు ఇంటికి వచ్చి అతన్ని పరామర్శించి, అతనికి వచ్చిన కష్టానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి, శవదహనానికి కావాల్సిన ఏర్పాట్ల సంగతి తమంతట తామే చూడసాగారు. శవాన్ని మోయడానికి కావల్సిన పాడె సిద్ధమవడంతో శ్రీనివాసు తండ్రి పార్థివ శరీరాన్ని దానిపై ఉంచి తాళ్లతో కట్టి శవయాత్రకు కావాల్సిన మిగతా ఏర్పాట్లను కూడా పూర్తిచేసి, శ్రీనివాసుని ఇంక బయలుదేరమన్నట్లుగా సౌజ్ఞ చేసారు. అతని ప్రమేయం లేకుండానే శవయాత్రకు కావాల్సిన ఏర్పాట్లన్నీ వారే దగ్గరుండి స్వయంగా చూసుకొన్నారు. అలాగే శ్మశానంలో కావాల్సిన మిగతా ఏర్పాట్లను కూడా కొంతమంది ముందుగానే వెళ్ళి అన్నీ సిద్ధం చేసారు.

అలా చుట్టుపక్కల వాళ్ళ సాయంతో ఎంతో ఘనంగా తండ్రికి అంత్యక్రియలు జరిపించాడు శ్రీనివాసు. తండ్రి అంతిమ క్రియలకి వచ్చి తనకు ఎంతో ససాయం చేసిన వారందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

"చూడండి శ్రీనివాసుగారూ..మనిషి సంఘజీవి. కనుక ప్రతి మనిషికి ఏదో ఒక విషయంలో తోటి మనిషి అవసరం ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. ఎందుకంటే..ఒకే చోట ఉన్నప్పుడు మనం ఒకరికొకరు సాయం చేసుకుంటూ ఒక్క కుటుంబంలా బ్రతకాలి. సుఖాలలో పాలు పంచుకొన్నా పంచుకోకపోయినా, కష్టాల్లో మాత్రం తప్పనిసరిగా పాలు పంచుకోవాలి" చెప్పడం ఆపాడు ప్రక్కింటి సుబ్బారావు.

"ఔనండి మీరన్నది అక్షరాలా నిజం. ఇదే విషయాన్ని మా నాన్నగారు కూడా ఎప్పుడూ అంటూండేవారు. కానీ నేను లేనిపోని అహంభావంతో నాన్నగారిని మాటలను లెక్కపెట్టేవాడిని కాను. బహుశా అనుభవం మీద నేనే తెలుసుకొంటానన్న నమ్మకమో ఏమో నాన్నగారు ఆ విషయంలో ఇంక నాతో వాదించేవారు కాదు. ఆయన మాటల్లోని అంతరార్థం ఇప్పుడు తెలిసింది" సిగ్గుగా అన్నాడు శ్రీనివాసు.

"శ్రీనివాసుగారు ఒక్క విషయం గుర్తుంచుకోండి. పుట్టిన ప్రతివాడు గిట్టకమానడు. చివరికి మనిషికి కావాల్సింది అటు ఆరడుగులు, ఇటు మూడడుగుల నేల అంతే. అలాగే ఎక్కువ తక్కువ అన్న తారతమ్యాలు. అగ్ర కులాలు, నిమ్నకులాలు అన్నవి మనం సృష్టించుకొన్నవే. పోయిన తరువాత ఏ కులంవాడైనా, మతంవాడైనా చేరవలసింది ఇక్కడికే. ప్రతి మనిషి కావాలని చెడ్డవాడు అవడు. మనిషి తాను చెడ్డగా మారడం వెనక ఏదో ఏదో ఒక బలమైన కారణం తప్పకుండా ఉంటుంది. ఎవరి ఇంట్లోనైనా శుభకార్యానికి వెళ్ళేముందు వాళ్ళు మనల్ని పిలిచారా లేదా అన్నది ప్రతి ఒక్కరు ఆలోచిస్తారు. కానీ ఇలాంటి అనర్థాలు జరిగినప్పుడు మాత్రం ఎవరూ అటువంటివి పట్టించుకోరు. తమంతట తాముగా వచ్చి సాధ్యమైనంతవరకు తమకు తోచిన సాయం అందిస్తారు. అదే మానవత్వంలోని గొప్పదనం" అన్న సుబ్బారావుగారి మాటలతో శ్రీనివాసుకి జ్ఞానోదయమయింది.

-సోమవఝుల నాగేంద్రప్రసాద్ (వారణాసి)